క్లుప్తంగా

త్రికోటేశ్వరుని సేవలో విజయనగరం ఎంపీ

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి వారిని విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లం చంద్రశేఖరరావు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎంపీ చంద్రశేఖరరావుకు ఈవో వేమూరి గోపి స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం శేషవస్త్రం, తీర్థప్రసాదాలు బహకరించారు. తరువాత వేదపండితుల ఆశీర్వచనాలు అందజేసారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈవో గోపి ఎంపీ చంద్రశేఖరరావుకు వివరించారు. భక్తులకు అమలుచేస్తున్న అన్నప్రసాదాన్ని ఎంపీ స్వీకరించారు. పాతకోటయ్యస్వామి ఆలయానికి చేపట్టిన మెట్ల మార్గానికి ఎంపీ లాడ్స్ నుంచి రూ.5 లక్షల విరాళాన్ని ఎంపీ చంద్రశేఖర్ ప్రకటించారు.

వీధి కుక్కల పట్టివేత

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో పంచాయతీ వారి సారథ్యంలో వీధి కుక్కలు పట్టివేత కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభించినట్లు పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు తెలిపారు. ఈసందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ గ్రామంలో వీధి కుక్కల సంచారం ఉండటంతో గ్రామస్తుల సహకారంతో సత్వర చర్యలు చేపట్టామన్నారు. పట్టుకున్న కుక్కలను అడవిలో వదిలి వేస్తామన్నారు. నాలుగు రోజుల పాటు ఈకార్యక్రమం కొనసాగుతుందని 50 కుక్కలను పట్టుకున్నట్లు చెప్పారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

నాదెండ్ల: పద్దెనిమిదేళ్లలోపు దివ్యాంగులైన బాల బాలికలకు గురువారం నరసరావుపేటలోని భవిత సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గణపవరం భవిత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీధర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగే వైద్య శిబిరాన్ని దివ్యాంగులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో అవసరమైన వారికి పరికరాలను సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో అందించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 99890 85102లో సంప్రదించాలని కోరారు.

రెండు లారీలు ఢీ

నాదెండ్ల: జాతీయ రహదారిపై వెళ్తున్న లారీని మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో లారీ ముందుభాగం ధ్వంసమైన సంఘటన చిలకలూరిపేట ఏఎంజీ ఎదురుగా ఉన్న చెక్‌పోస్టు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. గుంటూరు నుంచి తమిళనాడుకు పైపులలోడుతో వెళ్తున్న లారీని పొగాకును గణపవరంలో అన్‌లోడ్ చేసి తిరిగి జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకునే క్రమంలో మరో లారీ పైపులలోడు లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో పొగాకు లారీముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అయితే ప్రమాదంలో ఎవరూ గాయాలపాలు కాలేదు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గురైన లారీని రోడ్డుపై నుంచి తొలగించారు.

మిర్చి బస్తాలు పడి డ్రైవర్ మృతి

నరసరావుపేట టౌన్: మిర్చి బస్తాలు మీద పడి ఆటో డ్రైవర్ మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. కారంపూడికి చెందిన చల్లా వెంకటేశ్వర్లు(40) తన టాటా ఏసీ ఆటో వాహనంలో మిర్చి బస్తాలు తీసుకొని గుంటూరు యార్డుకు బయలుదేరాడు. నరసరావుపేట పట్టణంలోని రెడ్డి నగర్ వద్దకు రాగా ఆటోటైరు పంక్చరైంది. టైర్ పంచర్ వేస్తుండగా బస్తాలు డొర్లి మీద పడటంతో వెంకటేశ్వర్లు మృతిచెందినట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు వెల్లడించారు.


కేక్ కట్ చేస్తున్న మహిళా న్యాయవాదులు, పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి ఏ. తౌషిద్ హుస్సేన్


వినుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న మెప్మా సిబ్బంది


వేడుకల్లో పాల్గొన్న సూపర్‌వైజరు అంగన్‌వాడీ కార్యకర్తలు


గణపవరం హైస్కూలులో మాట్లాడుతున్న హెచ్‌ఎం సత్యనారాయణ

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- వివిధ రంగాల్లోని పలువురు మహిళలకు సన్మానం
- వేర్వేరు ప్రాంతాల్లో ఘనంగా మహిళా దినోత్సవం

నరసరావుపేట: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పట్టణ మహిళా సమైక్య ఆధ్వర్యంలో రైల్వే మొదటిగేట్ సమీపంలో ఉన్న మున్సిపల్ అతిథి గృహంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమాఖ్య అధ్యక్షురాలు సయ్యద్‌ఫాతిమా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దిశ సీఐ సుభాషిణి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మద్ది సుభాషిణి, డాక్టర్ వసంతరాయ, న్యాయవాది బ్లెస్సీనా, వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు ముడియం శేషమ్మ, సమాఖ్య అధ్యక్షురాలు ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.


నరసరావుపేటలో సమాఖ్య నాయకురాలు సయ్యద్ ఫాతిమాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

చిలకలూరిపేట: మహిళలు విద్యా, ఆర్థిక విషయాల్లో ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమౌతుందని డీఆర్ఎన్ఎస్‌సీవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరా సుజాత చెప్పారు. ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కరణం విజయ, సభ్యులు ఎండీ కరీమా, డాక్టర్ ప్రఫుల్లాదేవి, కోలా విజయలక్ష్మి, సీహెచ్ నిర్మలా, జి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు ఆదర్శం

వినుకొండ టౌన్: నేటి ఆధునిక మహిళలు భావితరాలకు ఆదర్శమని, మహిళలను గౌరవించాలని, పురుషులతో సమానంగా చూడాలని వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎ.తౌషిద్ హుస్సేన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా మంగళవారం మహిళా న్యాయవాదులు కోర్టు ఆవరణలో కేక్ కట్ చేయగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి తౌషిద్ హుస్సేన్ చేతుల మీదుగా బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఆర్.సామ్రాజ్యం, మహిళా న్యాయవాదులు అంజనీదేవి, లక్ష్మి, శివకుమారి, రెడ్డి నాగపద్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.వి.రమణారెడ్డి, కె.చెన్నకేశవ రెడ్డి, పి.గౌస్‌మోహిద్దీన్ ఖాన్, కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

యడ్లపాడు: మహిళలందరూ ప్రభుత్వం ఇస్తున్న పథకాలు అన్నింటినీ సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపీపీ విడుదల ఝాన్సీ చెప్పారు, యడ్లపాడు వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో వై.హనుమారెడ్డి, ఈవోపీఆర్డీ వరూధిని, మండల సమైక్య అధ్యక్షురాలు సువర్ణ, పథకాలువివరించారు.


చిలకలూరిపేటలో కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఒయాసిస్ సంస్థ సభ్యులు

వినుకొండలో ర్యాలీ

వినుకొండ(నూజెండ్ల): మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మెప్మా సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి శివయ్యస్థూపం సెంటర్ వరకు మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 30 వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ షకీలా దస్తగిరి పాల్గొని మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందంజ

బొల్లాపల్లి: మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని ఎంపీడీవో టి.పార్వతి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆటల పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు.

ఈపూరులో....

ఈపూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీడీపీవో బి.అరుణ ఆదేశాల మేరకు సూపర్‌వైజర్లు కె.చిన్నమ్మాయి, కె.రాజ్యలక్ష్మిల ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో ఉషా కిరణ్ మాట్లాడుతూ అందరూ శ్రద్ధగా పనిచేసి మంచి పేరు తీసుకురావాలన్నారు.

మహిళా శక్తి తిరుగులేనిది

నాదెండ్ల: దేశంలోనే అత్యున్నత పదవులను సైతం మహిళలుసమర్థవంతంగా నిర్వహించటం మహిళా శక్తికి తిరుగులేని ప్రతీక అని హెచ్ఎం సత్యనారాయణ చెప్పారు. గణపవరం కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం:మండలంలోనిమతుకుమల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటరులో అంతర్జాతీ య మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించినట్లు సెక్టారు సూపరువైజరు గుర్రం శేషకుమారి తెలిపారు. సూపర్‌వైజరు మాట్లాడుతూ మహిళలు అన్నీ రంగాల్లో రాణించాలన్నారు. మతుకుమల్లి పద్మ, జ్యోతిప్రసన్న పాల్గొన్నారు.

బాధ్యతగా పదవులు నిర్వహించాలి

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి


ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపిన ఎస్సీసెల్ జోన్ ఇన్‌చార్జి పాలపర్తి

నరసరావుపేట: పదవులను అలంకార ప్రాయంగా భావించకుండా ఒక బాధ్యతగా భావిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచించారు. పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల జోన్‌కు ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జిగా మాజీ కౌన్సిలర్ పాలపర్తి వెంకటేశ్వరరావు నియమితులైన విషయం విదితమే. మంగళవారం తన సంఘీయులు, ఎస్సీ నాయకులతో కలిసి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని ఘనంగా సన్మానించారు. తనకు పదవి లభించటంలో సహాయ సహకారాలు అందజేసినందుకు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ మొదటి నుంచి పార్టీలో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషిచేసిన వారికి న్యాయం జరుగుతుందనే దానికి నిదర్శనమే పాలపర్తికి రీజనల్ కోఆర్డినేటర్‌గా నియామకమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను వారిని కేవలం ఓటు బ్యాంకుగా కాకుండా పెద్దపీట వేసి వారిని రాజ్యాధికారం వైపు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నడిపిస్తున్నారన్నారు. 18 ఎమ్మెల్సీల్లో 14 ఎమ్మెల్సీ పదవులను ఈ వర్గాలకు కేటాయించారన్నారు. పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, న్యాయవాది బ్లెస్సీనా, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగ రాష్ట్ర కార్యదర్శి పాలపర్తి సామ్రాజ్యం, జిల్లా కార్యదర్శి కందుల ఎజ్రా, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు మల్లెల అశోక్, తొమ్మిదో వార్డు నాయకులు వెన్నపూస జోసెఫ్‌రెడ్డి, గాలం కోటేశ్వరరావు, టి.పెద్దిరెడ్డి, షేక్ రజాక్, కటీఫ్ మస్తాన్‌వలి, డీలర్ వెంకటేశ్వర్లు, జి.ఏసురత్నం, కె.ఐజాక్, ఎం.ఆంజనేయులు, టి.రామకృష్ణ, యు.మల్లికార్జున పాల్గొన్నారు.

వేల్పూరు హైస్కూలు సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: 40 సంవత్సరాల చరిత్ర కల్గిన జెడ్పీ ఉన్నత పాఠశాల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని వేల్పూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చరిత్ర కల్గియుండి ఎంతో మంది విద్యార్థులను బావి తరాలకు ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత వేల్పూరు హైస్కూలుకే దక్కుతుందన్నారు. తన మనుమలు, మనుమరాళ్ళు గ్రామస్తులు, విద్యార్థుల నడుమ ఉల్లాసంగా ఉత్సాహంగా ఇలాంటి వేడుకలలో పాల్గొనటం చాలా ఆనందంగా ఉందన్నారు. పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు. ఇదే స్కూల్లో ట్రిబుల్ ఐటీలో ఇప్పటి వరకు 40 మంది సీట్లు సాధించటంతో పాటు ఇద్దరు శాస్త్రవేత్తలగాను, 70 మంది ప్రవాస భారతీయులు అభివృద్ధి పథంలో పయనించటం మంచి శుభపరిణామన్నారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగాల అనిత సారథ్యంలో సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ పేరెంట్ కమిటీ చైర్మన్ దావులూరి ఏడుకొండలు, వివేకానంద పూర్వ విద్యార్థుల ప్రతినిధి సంద్రపాటి చలపతి రావు, తూమాటి కబ్బారావు, గట్టుపల్లి వీరాస్వామి, ఉపాధ్యాయులు మరియదాసు, గురుబాబు, రత్నలత పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని సత్కరిస్తున్న ప్రధానోపాధ్యాయులు జంగాల అనిత

వీరయ్య మాస్టారుకు ఘన నివాళి

వినుకొండ(నూజెండ్ల): విశ్రాంత ఉపాధ్యాయులు గంగినేని వీరయ్య మాస్టారు మృతి చెందడం చాలా బాధాకరమని నూజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్. అన్నపూర్ణమ్మ తెలిపారు. స్థానిక పాఠశాలలో వీరయ్యమాస్టార్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీరయ్య మాస్టారు గతంలో ఎస్ఎంసీ చైర్మన్‌గా పనిచేస్తూ పాఠశాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. పాఠశాలకు సొంత ఖర్చులతో గ్రంథాలయ గది నిర్మాణం, డిజిటల్ తరగతులు ఏర్పాటు చేశారన్నారు.

నేత్రపర్వంగా బ్రహ్మోత్సవాలు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న భూసమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 9వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండవరోజు భాగంగా మంగళవారం ఆలయ ధర్మకర్త ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిమాధవాచార్యులు, వెంకట శేషాచార్యులు, సాత్విక్ వేదమంత్రాలు, మేళతాళాలతో ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం గరుడవాహనంపై ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. స్వామి వారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవాలయాన్ని బ్రహ్మోత్సవాలు సందర్భంగా విద్యుత్ దీపకాంతులతో ముస్తాబు చేశారు.



మంచి పౌరులుగా ఎదగండి



వినుకొండ టౌన్: ప్రభుత్వం అందిస్తున్న సహకారంతోపాటు దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించి మంచి పౌరులుగా ఎదగాలని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం సభ్యులు భువనగిరి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పట్టణంలోని మసీదు మాన్యంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం సభ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా తమ సంఘం తరుపున నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా కేంద్రంలోని 40 మంది చిన్నారులకు ఉపయోగపడే రైస్ కుక్కర్, వాటర్ ట్యాంక్, ప్లేట్లు, గ్లాసులు, ఇతర సామగ్రిని కేంద్రం నిర్వాహకులకు అందచేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎం.నాగేశ్వరరావు, రామలింగేశ్వరరావు, జోజయ్య, టి. శేషయ్య, ఎంవి. శర్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

నాదెండ్ల: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న రీసర్వే పనులను వేగవంతం చేయాలని తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. చిరుమామిళ్ళ గ్రామంలో మంగళవారం రీసర్వే పనులను ఆమె పరిశీలించారు. గ్రామంలో రీసర్వే పనులు 75 శాతం పూర్తికాగా గడిచిన రెండు రోజులుగా హద్దు రాళ్ల ఏర్పాటు కార్యక్రమం జరుగుతోంది. సుమారు వందేళ్ల అనంతరం తిరిగి ప్రస్తుతం భూముల సర్వే జరుగుతోందని, దీంతో గ్రామాల్లో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. రీసర్వే అనంతరం రైతులకు పత్రాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాదెండ్ల సొసైటీ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: స్వయం సంఘాల్లోని మహిళా సభ్యులు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుని మంచి ఆర్థిక ప్రగతి సాధించాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు ఇలింద్రపర్తి విశ్వనాథ్ కోరారు. మంగళవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో స్వయం సహాయక మహిళా సభ్యులకు రుణాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజరు మాట్లాడుతూ డిపాజిట్స్ అధికంగా వడ్డీరేటు ఇస్తున్న ప్రభుత్వరంగా బ్యాంకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అన్నారు. గత డిసెంబరు నెల నుంచి నేటి వరకు 48 మహిళా గ్రూపులకు రూ. 5 కోట్లు 70 లక్షలు రుణాలు మంజూరు చేశామన్నారు.

విస్తృత సేవలందించాలి



నాదెండ్ల: సచివాలయాల్లో ప్రజలకు విస్తృత స్థాయిలో సేవలందించాలని జెడ్పీ సీఈవో జె.మోహన్‌రావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయాన్ని, 1వ సచివాలయాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న తీరు, స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రజల వినతులను సకాలంలో పరిష్కరిస్తున్నారా లేదా అని పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బంది సకాలంలో విధులకు హాజరవుతున్నారా లేదా అని పరిశీలించి డ్రెస్ కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు. సచివాలయాల్లో ప్రభుత్వం నిర్దేశించిన సేవలన్నీ ప్రజలకు అందేలా చేసి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఎంపీపీ తలతోటి రాణి, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్‌లు సీఈవో మోహన్‌రావును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆంజనేయులు, పంచాయతీరాజ్ ఏఈ రమణారెడ్డి, ఏపీవో పుష్పరాజు, కార్యదర్శి శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

గంగులపల్లిలో అసైన్డ్ భూముల పరిశీలన

బొల్లాపల్లి: మండలంలోని గుట్లపల్లి పంచాయతీ పరిధిలోని గంగుపల్లి ఎస్సీ కాలనీ అసైన్డ్ భూములను పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పెద్దిటి పొలేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీవాసులు గ్రామ డి నంబర్లు 676, 677/1, 674, 665/5లో మొత్తం 30 ఎకరాలకు తమకు పట్టాలు ఇప్పించాలని, ఎప్పటి నుంచో అసైన్డ్ భూములను తమ స్వాధీనంలో ఉన్నాయని పొలేష్‌కు తెలిపారు. భూములను సందర్శించిన సమయంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన కొందరు అక్కడకు వచ్చి ఆ భూములు తమ స్వాధీనంలో ఉన్నాయని తెలపగా, ప్రభుత్వ భూములు భూమి లేని ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే చెందుతాయని, ఇతరులు స్వాధీనపరచుకోవడానికి వీలు లేదని పొలేష్ చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు సమస్యను శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడుతో చర్చించి జిల్లా కలెక్టర్ ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ దళిత సంఘాల నాయకులు రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, పిడుగు విజయ్‌బాబు, అమృతపూడి హైగ్రాజు, సర్పంచ్ ఆదాం, నాసరబాబు, దోర్నల గురవయ్య, ఎస్సీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులవి పగటి కలలు

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- 14వ వార్డు గడపగడపలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందనే ఆ పార్టీ నాయకుల కలలు పగటి కలలేనని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి, ఇక్కడ ఎమ్మెల్యేగా తాను హ్యాట్రిక్ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి పట్టణంలోని 14వ వార్డు కంభంపాలెంలో రెండోరోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. వార్డుకు వచ్చిన ఎమ్మెల్యేకు సీనియర్ నాయకులు కాకుమాను మంగపతిరెడ్డి, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి మద్దిరెడ్డి నరసింహారెడ్డి, వార్డు ఇన్‌చార్జి బండి వెంకటేశ్వరరెడ్డి సారథ్యంలో మాజీ కౌన్సిలర్ చల్లగుండ్ల సతీష్, పాతర్లంక చిన్ని, తలారి నాని, బూదాల కిరణ్, పరుచూరి సురేష్, బాలరాజు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేశారన్నారు. ముఖ్యంగా మహిళలు అందరూ సీఎం జగన్‌కే ఓటువేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తల్లకిందులైనా చంద్రబాబు ముఖ్యమంత్రి కాలేడని, అతని కొడుకు లోకేష్ జీవితంలో సీఎం కాలేడని అన్నారు. వార్డు పరిధిలోని ప్రజలకు గత మూడున్నరేళ్లలో రూ.3.72 కోట్లు పథకాల ద్వారా పంపిణీ చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, మున్సిపల్ డీఇ ఓలేటి శ్రీనివాసరావు, ఆర్ఐ సూర్యనారాయణ రెడ్డి, విద్యుత్‌శాఖ ఏఇ సురేంద్ర, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి గంటెనపాటి గాబ్రియేలు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లెల అశోక్, సీనియర్ నాయకుడు ఇప్పల దానారెడ్డి, మాజీ కౌన్సిలర్లు మాడిశెట్టి మోహనరావు, మాగులూరి రమణారెడ్డి, షేక్ రెహమాన్, బత్తుల లక్ష్మీ పద్మలత, పట్టణ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు వేముల శివ పాల్గొన్నారు.


లబ్ధిదార్లకు అందిన పథకాల వివరాలు గల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి